AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatodaynews.com


## ఎస్సారెస్పీలో 38.41 టీఎంసీలకు చేరిన నీటినిల్వ



**అక్షరటుడే, మెండోరా :** ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు, మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టు నుంచి వస్తున్న వరదతో ఎస్సారెస్పీలో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ప్రాజెక్టులోకి వరద నీరు కొనసాగుతుండటంతో శ్రీరాంసాగర్ ఆయకట్టు పరిధిలోని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం ఉదయం 9 గంటల సమయానికి ప్రాజెక్టులోకి 24,935 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైనట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 80.5 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 38.4 టీఎంసీల నీటి నిల్వ ఉంది.


7-8-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2





## స్నేహ సొసైటీ ఆధ్వర్యంలో వైభవంగా బోనాల జాతర

**అక్షరటుడే, ఇందూరు:** జిల్లా కేంద్రంలోని తారకరామనగర్‌లో ఉన్న స్నేహ సొసైటీ అంధుల ప్రత్యేక పాఠశాలలో శుక్రవారం బోనాల జాతర వైభవంగా జరిగింది. పాఠశాల భవనం నుండి పోలేరమ్మ ఆలయం వరకు పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల నృత్యాల నడుమ అమ్మవారికి బోనాలు సమర్పించారు. ట్రాన్స్‌జెండర్ జరీనా ఆధ్వర్యంలో ట్రాన్స్ మహిళలు వివిధ వేషధారణలతో బోనాలు ఎత్తి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 2014 నుండి ప్రతి ఏటా ఇక్కడ బోనాలు ఘనంగా నిర్వహిస్తున్నామని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నామని సంస్థ కార్యదర్శి ఎస్.సిద్దయ్య తెలిపారు. ప్రిన్సిపాళ్లు ఎస్ జ్యోతి, రాజేశ్వరి, కార్యవర్గ సభ్యులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## కేసుల విషయంలో పారదర్శకత తప్పనిసరి: ఎస్పీ రాజేష్ చంద్ర



**అక్షరటుడే, కామారెడ్డి:** ప్రజల నుంచి పిటిషన్ స్వీకరించిన క్షణం నుంచి పరిష్కారం వరకు మొత్తం ప్రక్రియలో తప్పనిసరిగా పారదర్శకత పాటించాలని ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన రిసెప్షన్ వర్టికల్ శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజల నుంచి అందే ప్రతి పిటిషన్‌ను ఎలాంటి ఆలస్యం లేకుండా సీసీటీఎన్ఎస్‌లో నమోదు చేసి, పిటిషన్ దారుడికి వెంటనే రిసీప్ట్ అందించాలన్నారు. ప్రతి కేసులో వివరాలను సక్రమంగా నమోదు చేసి తదుపరి చర్యలు వేగంగా చేపట్టాలని సూచించారు.

# యథేచ్ఛగా కల్తీకల్లు దందా



జిల్లాలో కల్తీ కల్లు దందా జోరుగా సాగుతోంది. నిషేధిత మత్తు పదార్థాలతో డిపోల నిర్వాహకులు కల్లు తయారు చేస్తున్నారు. అల్ప్రాజోలం, డైజోఫామ్ వంటి రసాయనాలతో కల్లు తయారు చేసి విక్రయిస్తున్నారు. ఇవి తాగుతున్న ప్రజలు అనారోగ్యం భారీన పడుతున్నారు. అసలు ఈత, తాటి చెట్లు లేకున్నా.. కల్లు తయారు చేసి అమ్ముతున్నారంటే కల్తీ ఏ స్థాయిలో జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

- అక్షరటుడే, కామారెడ్డి

**■ ప్రజల ప్రాణాలతో చెలగాటం ■ అల్ప్రాజోలం, మత్తు పదార్థాలతో కల్లు తయారీ ■ పట్టించుకోని అధికారులు**

కామారెడ్డి జిల్లా లో నిషేధిత మత్తు పదార్థాల సరఫరా చాపకింద నీరులా జోరుగా సాగుతోంది. అల్ప్రాజోలం, డైజోఫాం, ఇతర మత్తు పదార్థాలు బహిరంగంగానే దిగుమతి చేసుకుంటున్నారు. ఈ అక్రమ దందాను వ్యాపారంగా మార్చుకున్న కొందరు వ్యక్తులు అధికారులకు ఎంతోకొంత ముట్టజెప్పి దర్జాగా అనుకున్న ప్రాంతాలకు డంప్ చేస్తున్నట్టుగా ప్రచారం సాగుతోంది. వేళ్ళమీద లెక్క పెట్టే సంఖ్యలో ఉన్న అక్రమ వ్యాపారులను కట్టడి చేయడంలో సంబంధిత శాఖలు పూర్తిగా విఫలం అవుతున్నారన్న విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి.

### వ్యసనంగా...

కల్తీ కల్లును గ్రామాల్లో సీసాకు రూ.10 నుంచి రూ.20 వరకు విక్రయిస్తున్నారు. పట్టణాల్లో దీని ధర అధికంగా ఉంది. అయితే కూలీ పనులు చేసే వారు, రైతులు, కార్మికులు రోజంతా కష్టపడి పని చేసి.. ఆ అలసట మర్చిపోవడానికి కల్లు తాగుతున్నారు. అయితే ఇందులో మత్తు పదార్థాలు కలపడంతో వారు అనారోగ్యం బారిన పడుతున్నారు. వాంతులు, గుండె దడ, తలనొప్పి, స్పృహ కోల్పోవడం సాధారణం అయ్యింది. గత మూడు నెలల్లో ఆస్పత్రులకు ఇలాంటి లక్షణాలతో పదుల సంఖ్యలో కేసులు వచ్చినట్టు రికార్డులు చెబుతున్నాయి. అంతేగాకుండా ఈ కల్లు తాగేవారు బానిసలుగా మారుతున్నారు. ఒకవేళ కల్లు దొరకకపోతే పిచ్చి పట్టినట్లు వ్యవహరిస్తున్నారు.

### చాపకింద నీరులా

జిల్లాలో అల్ప్రాజోలం, డైజోఫాం సరఫరా నెట్‌వర్క్ విస్తృతంగా ఉంది. పట్టణ శివారుల్లోని అద్దె గోడౌన్లు, గ్రామీణ దుకాణాల వెనుక గదులు, వ్యవసాయ బావుల పక్కన ఉన్న షెడ్లు ఇందుకు కేంద్రాలుగా మారాయి. కొద్దిమంది వ్యక్తులు ఈ అక్రమ వ్యాపారాన్ని సిండికేట్‌గా నడుపుతున్నారన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఫిర్యాదులు వచ్చినప్పుడు అధికారులు నామమాత్రపు తనిఖీలు చేసి కేసు నమోదు చేసి వదిలేస్తుండటంతో వ్యాపారుల ఆగడాలకు అడ్డుఅదుపు లేకుండా పోతుందన్న విమర్శలున్నాయి.

### నిఘా వైఫల్యమా

పోలీస్, ఎక్సైజ్ శాఖలకు ఫిర్యాదు వస్తే తప్ప దాడులు చేయడం లేదన్న విమర్శలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. జిల్లాలో 276 లైసెన్స్ ఉన్న కల్లు దుకాణాలు, 23 కల్లు డిపోలు, 66 సొసైటీలు ఉన్నాయి. గత ఆరు నెలల్లో జరిగిన తనిఖీల సంఖ్య పదుల సంఖ్య కూడా దాటలేదని తెలుస్తోంది. ప్రజారోగ్యాన్ని పణంగా పెట్టి జరుగుతున్న ఈ దందాను కట్టడి చేయడంలో సంబంధిత శాఖలు పూర్తిగా విఫలమయ్యాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.

### మత్తు పదార్థాల రవాణాపై నిఘా పెట్టాం

జిల్లాలో తయారవుతున్న కల్లులో మత్తు పదార్థాలు కలుపుతున్నారు అనడానికి ఆధారాలు లేకుండా పోతున్నాయి. వాటి నిర్ధారణ కోసం శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపిస్తున్నాం. గత జులై నెలలో 102 శాంపిల్స్ సేకరించి పంపించాం. అల్ప్రాజోలం లాంటి మత్తు పదార్థాలు ఎక్కడినుంచి వస్తున్నాయనే దానిపై ప్రత్యేక నిఘా పెట్టాం. కల్తీ కల్లు విక్రయించే వారితో పాటు నిషేధిత మత్తు పదార్థాలు వాడుతున్న వారిపై ఖచ్చితమైన చర్యలు తీసుకుంటాం.

– ముకుంద రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్, కామారెడ్డి



## పాఠశాల స్థాయి నుంచే పర్యావరణ అవగాహన పెంచాలి

**అక్షరటుడే, కామారెడ్డి:** జీవవైవిధ్యాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. శుక్రవారం కామారెడ్డి మండలం గర్గుల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎకో సెన్స్ ప్రాజెక్ట్ నమూనాపై నిర్వహించిన ప్రత్యేక వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్య సంరక్షణలో ఆధునిక సాంకేతికతను ఎలా వినియోగించాలనే అంశంపై వారికి కలెక్టర్ అవగాహన కల్పించారు. పరిసర ప్రాంతాల్లో సంచరించే వివిధ రకాల పక్షులను రియల్‌టైమ్‌లో పర్యవేక్షించడం, పక్షుల ధ్వనుల ఆధారంగా వాటిని గుర్తించడం, అవి కనిపించిన సమయాన్ని నమోదు చేయడం, నిర్దిష్ట ప్రాంతంలో పక్షుల సంచారాన్ని గుర్తించడం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. జిల్లాలోని అన్ని అటల్ టింకరింగ్ ల్యాబ్ పాఠశాలల్లో ఇలాంటి ఎకో సెన్స్ నమూనాలను ఏర్పాటు చేసి, విద్యార్థులను పర్యావరణహిత సాంకేతిక ప్రాజెక్టుల వైపు ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. డీఈవో మల్లికార్జున్, ఎంఈవో ఎల్లయ్య, జిల్లా సైన్స్ అధికారి సిద్ధిరామ్ రెడ్డి, స్థానిక అటల్ టింకరింగ్ ల్యాబ్ ఇన్‌ఛార్జి బాలగంగాధర్, సోహం రోబోటిక్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## చేనేతకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా చేయూతనందిస్తుంది




**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** చేనేతకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా చేయూతనందిస్తుందని నగర మేయర్ ఉమారాణి అన్నారు. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలు ధరించి చేనేతను ప్రోత్సహించాలని ఆమె సూచించారు. నగరంలోని చేనేత సహకార సంఘ భవనంలో శుక్రవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని చేనేత సహకార సంఘం అధ్యక్షురాలు గుజ్జ రాజేశ్వరి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. నగర మేయర్ ఉమారాణి ముఖ్యాతిథిగా హాజరై మాట్లాడారు. చేనేత కార్మికులను సన్మానించారు. నేత కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. చేనేతకు నూతన సాంకేతికతను జోడించి వస్త్రాలు నేయాలని సూచించారు. జిల్లా చేనేత సహకార సంఘానికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందజేస్తానని మేయర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో చేనేత సహకార సంఘం ఉపాధ్యక్షుడు అవదూత విఠల్, కోశాధికారి నందాల నరేష్, డైరెక్టర్లు గుద్దేటి రామకృష్ణ, గాలిపల్లి అరుణ,కైరంకొండ బాల్ రాజ్, దిండిగల్ల శంకర్, కారంపురి ప్రభు,పద్మశాలి హాస్టల్ అధ్యక్షుడు దీకొండ యాదగిరి, పుల్గం హన్మాండ్లు, అవదూత దశరథం, చౌటి భూమేశ్వర్, కన్న దుబ్బ రాజం, గుజ్జేటి వెంకట్ నర్సయ్య పాల్గొన్నారు.

## విద్యార్థుల సమస్యకు పోచారం తక్షణ పరిష్కారం.. బస్సు సర్వీస్ ఏర్పాటు



**అక్షరటుడే, బాన్సువాడ:** బీర్కూర్ పరిసర గ్రామాల విద్యార్థుల ప్రయాణ ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి వెంటనే స్పందించారు. ప్రత్యేక బస్సు సర్వీసు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. బాన్సువాడ నుంచి తిమ్మాపూర్ వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించేందుకు శుక్రవారం వెళ్తున్న సందర్భంగా కిష్టాపూర్ గ్రామ బస్టాండ్ వద్ద సుమారు 20 మంది విద్యార్థులు బస్సు కోసం వేచి ఉండడాన్ని ఆయన గమనించారు. వెంటనే వాహనాన్ని ఆపి విద్యార్థులతో మాట్లాడగా.. సమయానికి బస్సులు అందుబాటులో లేక ముందుగా బాన్సువాడకు వెళ్లి అక్కడి నుంచి మరో బస్సులో ఎస్ఆర్ఎన్‌కే డిగ్రీ కళాశాలకు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. దీంతో ప్రతిరోజూ ఆలస్యంగా కళాశాలకు చేరుకుంటున్నామని వారు వివరించారు. విద్యార్థుల సమస్యను తెలుసుకున్న పోచారం శ్రీనివాసరెడ్డి వెంటనే బాన్సువాడ డిపో మేనేజర్ రవికుమార్‌తో ఫోన్‌లో మాట్లాడి, బాన్సువాడ-బీర్కూర్-కిష్టాపూర్-తిమ్మాపూర్-బొమ్మందేవ్‌పల్లి చౌరస్తా మీదుగా బస్సు నడపాలన్నారు.

## ఎల్లారెడ్డి అభివృద్ధికి సీఎం గ్రీన్‌సిగ్నల్



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధిని నిధులు ఇవ్వాలని ఎమ్మెల్యే మదన్ మోహన్ కోరారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గానికి అత్యంత కీలకమైన పలు అభివృద్ధి పనులకు పరిపాలనా ఆమోదం, నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు 22వ ప్యాకేజీ పనులకు వెంటనే పరిపాలన, ప్రభుత్వ అనుమతులు మంజూరు చేయాలని కోరారు. ఎల్లారెడ్డి పట్టణంలో నూతన ఆర్టీసీ బస్ డిపో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. బాన్సువాడ-ఉప్పల్వాయి ప్రధాన రహదారిపై సర్వాపూర్-మొండిసడక్ మధ్య, గాంధారి-తిమ్మాపూర్ మధ్య హై లెవల్ బ్రిడ్జిల నిర్మాణానికి ఆమోదం ఇవ్వాలని కోరారు. ఈ రెండు వంతెనలు నిర్మిస్తే వర్షాకాలంలో ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులు పూర్తిగా తొలగిపోయి, రాకపోకలు సులభతరం అవుతాయని వివరించారు. విద్యా రంగ అభివృద్ధిలో భాగంగా గాంధారి మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని సీఎంను ఎమ్మెల్యే మదన్ మోహన్ కోరారు. నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన అన్ని పనులకు నిధులు విడుదల చేస్తామని సీఎం హామీ ఇచ్చారు.

## మిట్టపల్లి ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి నిధులు



**అక్షరటుడే, డిచ్‌పల్లి:** మండలంలోని మిట్టపల్లి గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి నిధులు మంజూరు చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం గ్రామస్థులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి గ్రామస్థులు తమవంతుగా రూ. 8 లక్షలు సమకూర్చగా, రూ. 32 లక్షలు ప్రభుత్వం దేవాదాయ శాఖ కింద మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన ప్రొసీడింగ్స్ పత్రాన్ని ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం గ్రామానికి చెందిన పలువురు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా వారందరికీ కండువాలు వేసి ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బాల గంగాధర్, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు లింబాద్రి, ప్రధాన కార్యదర్శి కిషన్, ఉపాధ్యక్షుడు గంగారాం, రాజన్న, ఎండి అబీబ్ ఖాన్, రమేష్ పాల్గొన్నారు.

## అర్బన్‌లో అభివృద్ధి పనులపై కేంద్ర మంత్రికి ధన్‌పాల్ వినతి



**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని పలు రోడ్లు, వంతెనల అభివృద్ధి పనులకు సంబంధించి ప్రతిపాదనలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ తెలిపారు. ఎంపీ అర్వింద్‌తో కలిసి శుక్రవారం కేంద్ర రోడ్డు జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ప్రతిపాదనలను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నగరంలోని దేవీ రోడ్డు, రైల్వే స్టేషన్, నాందేవ్‌వాడ అదనపు వంతెన (ఆర్వోబీ) మంజూరుచేయాలని కోరామన్నారు. అలాగే సోనీ ఫంక్షన్ హాల్ సమీపంలో ఎల్లమ్మ గుట్ట వద్ద ఆర్‌యూబీఏర్పాటు చేయడం అత్యంత ఆవశ్యకమన్నారు. ఇందుకోసం రెండింటికి రూ.170 కోట్లు మంజూరు చేయాలని కోరారు. అలాగే నిజామాబాద్‌లోని రేడియో స్టేషన్ నుంచి ముదక్‌పల్లి పాత జీపీ ఆఫీస్ వరకు రూ.30కోట్లతో ఆర్అండ్‌బీ రోడ్డు కోసం ప్రతిపాదనలు సమర్పించామని చెప్పారు. వర్ని జంక్షన్ నుంచి నిజామాబాద్, డిచ్‌పల్లి, ఇందల్వాయి, భీమ్‌గల్ మీదుగా కమ్మర్‌పల్లి వరకు నగరాన్ని కలుపుతూ 107 కిలోమీటర్ల పొడవుతో కొత్త జాతీయ రహదారి ప్రతిపాదనను కూడా అందజేశామన్నారు. నగరంలోని రాజీవ్ గాంధీ విగ్రహం నుంచి ఎన్టీఆర్ విగ్రహం, దుబ్బ మీదుగా కాలూర్ రోడ్డు ను పూర్తి చేయాలని కోరామని తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి అభయ్ పాటిల్, ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు ఉన్నారు.

## భూభారతి, సాదాబైనామా దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి



**అక్షరటుడే, ఇందూరు:** భూ భారతి, సాదాబైనామా పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశించారు. కలెక్టరేట్ లో శుక్రవారం ఆయన అన్ని మండలాల తహశీల్దార్లతో భూ భారతి, సాదాబైనామా పెండింగ్ దరఖాస్తులు, ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంపై సమీక్ష జరిపారు. పెండింగ్ దరఖాస్తులను సమగ్రంగా పరిశీలన జరుపుతూ ఈ నెలాఖరులోగా అన్నింటిని పరిష్కరించాలని కలెక్టర్ గడువు విధించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చొరవ చూపాలన్నారు. దరఖాస్తుల ధ్రువీకరణ ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం పాటించాలని, ప్రాధాన్యత క్రమంలో దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లా స్థాయిలో నిర్వహించే ప్రజావాణితో పాటు, రాష్ట్ర స్థాయిలో నిర్వహించే సీఎం ప్రజావాణి కార్యక్రమాల ద్వారా వచ్చిన అర్జీల పరిష్కారం విషయంలోనూ ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ కోసం వచ్చిన దరఖాస్తులను కూడా సత్వరమే పరిశీలిస్తూ పరిష్కరించాలన్నారు. అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించుకుని ఈనెల 17వ తేదీ లోపు అన్ని ఎఫ్ఆర్సీ దరఖాస్తులు పరిష్కారం అయ్యేలా చూడాలని కలెక్టర్ సూచించారు. కస్టం మిల్లింగ్ కోసం లేవీ ధాన్యం కేటాయించిన రైస్ మిల్లులను ప్రతి పక్షం రోజులకు ఒకసారి అయిన తప్పనిసరిగా సందర్శిస్తూ, ధాన్యం నిల్వలను పరిశీలించాలని తహశీల్దార్లను ఆదేశించారు. సమీక్షా సమావేశానికి ఆలస్యంగా హాజరైన తహశీల్దార్లకు కలెక్టర్ భవేష్ మిశ్రా షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

## పార్టీలకతీతంగా ఆర్మూర్ అభివృద్ధి




**అక్షరటుడే,ఆర్మూర్:** పార్టీలకు అతీతంగా ఆర్మూర్ పట్టణాన్ని అభివృద్ధి చేయనున్నట్లు మున్సిపల్ ఛైర్‌పర్సన్ గోనె లహరి రఘు అన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో శుక్రవారం మున్సిపల్ సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 44 ఎజెండా అంశాలకు కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ముఖ్యంగా వర్షాకాలం నేపథ్యంలో 36 వార్డుల్లో డ్రైనేజీల పునరుద్ధరణకు ఒక వార్డుకు రూ.5 లక్షలు కేటాయించారు. మరోవైపు ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం, వినాయక చవితి, దసరా నేపథ్యంలో పట్టణంలోని వార్డుల్లో రోడ్ల ఆధునికీకరణకు మొరం పనులకు తీర్మానించారు. ఆర్మూర్ పట్టణ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని ఛైర్‌పర్సన్ గోనెలహరి ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ కాటిపల్లి వెంకటరెడ్డి, కమిషనర్ శ్రీహరి రాజు, కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





## సేవాదళ్ మండల అధ్యక్షుల నియామకం

**అక్షరటుడే, కామారెడ్డి:** రాష్ట్ర సేవాదళ్‌ను గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసే లక్ష్యంతో కామారెడ్డి జిల్లాకు చెందిన పలువురు మండల, నియోజకవర్గ, టౌన్ అధ్యక్షులకు నియామక పత్రాలు అందజేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సేవాదళ్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు గడ్డమీది మహేష్ కలిసి నూతన పదాధికారులకు నియామక పత్రాలను అందజేశారు. కామారెడ్డి నియోజకవర్గ అధ్యక్షుడిగా మెహర్ బాబా గౌడ్, కామారెడ్డి టౌన్ అధ్యక్షుడిగా కోమ్మరాజుల సుదర్శన్, కామారెడ్డి మండల అధ్యక్షుడిగా ప్రణీత్ కుమార్ నియమితులయ్యారు. అలాగే రాజంపేట మండల అధ్యక్షుడిగా వేణుగోపాల చారి, పాల్వంచకు హరీష్, మాచారెడ్డికి మలోత్ మహేష్, దోమకొండకు దోర్నాల ప్రవీణ్ కుమార్, బీబీపేట్‌కు కలకుంట్ల రాజు, భిక్కనూర్‌కు గిజువెల్లి మాధవ రెడ్డి నియమితులయ్యారు.

## విద్యార్థులకు మెడికల్ కోడింగ్‌పై అవగాహన సదస్సు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మెడికల్ కోడింగ్ పైన అవగాహన సదస్సును నిర్వహించారు. ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మెడికల్ కోడింగ్ వల్ల కలిగే లాభాలను విద్యార్థులకు వివరించారు. హైదరాబాద్‌లోని లాయల్ ఇనిస్టిట్యూట్ సీనియర్ స్పెషలిస్ట్ ట్రైనర్ మెడికల్ కోడింగ్ అరుణ్ కుమార్ మెడికల్ కోడింగ్ ద్వారా లభించే ఉద్యోగావకాశాలపై వివరించారు. ఆర్‌సీఎం కంపెనీ మేనేజర్ సంసన్ ఆర్వన్ మాట్లాడుతూ.. మెడికల్ కోడింగ్ వల్ల కలిగే స్వదేశ విదేశీ అవకాశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల రిటైర్డ్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ అనంతరావు, రిటైర్డ్ పోస్ట్‌మాస్టర్ ప్రసన్నకుమార్, లయోలా ఇనిస్టిట్యూట్ హైదరాబాద్ ఇన్‌ఛార్జి అభినయ్, వైస్ ప్రిన్సిపల్ చంద్రకాంత్, ఐక్యూఏసీ సమన్వయకర్త శంకరయ్య, టీఎస్‌కేసీ సమన్వయకర్త శివకుమార్, సైన్స్ ఇన్‌ఛార్జి అరుణ్ కుమార్, శశిధర్, సీనియర్ ఆధ్యాపకులు ప్రభాకర్ రావు, నాగనిక, ఎస్.చంద్రకాంత్, జి.రాణి, సిద్ధిరాజు, గంగారెడ్డి, గోదావరి తదితరులు పాల్గొన్నారు.



# అధ్వానంగా
# మినీ ట్యాంక్‌బండ్..

■ కామారెడ్డి పెద్ద చెరువు అభివృద్ధిపై నిర్లక్ష్యం ■ అస్తవ్యస్తంగా పరిసరాలు ■ నిర్వహణ లేక రూ.కోట్ల నిధులు వృథా

**కామారెడ్డి పెద్ద చెరువు అభివృద్ధిపై అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. చెరువును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు నాటి ప్రభుత్వం రూ.కోట్లల్లో నిధులు విడుదల చేసింది. అయితే నిర్వహణ లోపం కారణంగా ప్రస్తుతం ఆ ప్రాంతం చిట్టడవిని తలపిస్తోంది. పర్యాటకులు కాదుకదా ఎవరు కూడా వెళ్లలేని విధంగా తయారైంది.**

**– అక్షరటుడే, కామారెడ్డి**

పెద్ద చెరువును అభివృద్ధి చేసే క్రమంలో గత ప్రభుత్వం రూ.8కోట్లు విడుదల చేసింది. కట్టపై రోడ్డు, పాదచారుల కోసం ప్లాట్‌ఫామ్‌లు, రెయిలింగ్‌లు ఏర్పాటు చేసింది. కానీ నిర్వహణ బాధ్యత లేకపోవడంతో ఆ మొత్తం వ్యర్థమైంది. ఇప్పుడు కట్టపై రోడ్డు పూర్తిగా గుంతలతో, బురదతో నిండి వాహనాలు వెళ్లలేని స్థితికి చేరింది. ఒకప్పుడు నిర్మించిన ప్లాట్‌ఫామ్‌లు, రెయిలింగ్‌లు పిచ్చి మొక్కలతో కనిపించకుండా పోయాయి. చుట్టూ పొదలు పెరిగిపోవడంతో రోడ్డు ఇరుగ్గా మారి ఒంటరిగా వెళ్లడం ప్రమాదకరంగా మారింది.

### ఆకతాయిలకు అడ్డాగా..

ఆకతాయిలకు చెరువు కట్ట అడ్డాగా మారింది. సాయంత్రం సమయంలో మద్యం ప్రియులు కట్టను యథేచ్ఛగా వాడుకుంటున్నారు. ప్రజలు ఉపయోగించుకోవాల్సిన ఈ సదుపాయాలను కాపాడకుండా అధికారులు కనీస పర్యవేక్షణ కూడా చేయకపోవడంతో రూ.కోట్ల నిధులు వృథాగా మిగిలిపోయాయి. రూ.8 కోట్లు ఖర్చు చేసినా మినీ ట్యాంక్ బండ్ గా మార్చకపోవడం పట్ల ప్రజలు పెదవి విరుస్తున్నారు.

### గార్డెనింగ్.. బోట్ షికారు..

గార్డెనింగ్, బోట్ షికారు ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీలు కూడా నీళ్లపాలయ్యాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. పట్టణానికి ముఖ్యమైన పర్యాటక ప్రాంతం పెద్ద చెరువు అని.. ప్రస్తుత ప్రభుత్వమైనా మినీ ట్యాంక్ బండ్‌ను తీర్చిదిద్దాలని.. అద్భుత పర్యాటక ప్రాంతంగా రూపొందించాలని స్థానికులు కోరుతున్నారు.





## ఆర్మూర్ పట్టు చేనేత సభ్యులకు సన్మానం

**అక్షరటుడే, ఆర్మూర్ :** చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని 40 ఏళ్లుగా సేవలందిస్తున్న పలువురిని శుక్రవారం పట్టణంలో సన్మానించారు. పట్టు చేనేత సహకార సంఘం అధ్యక్షుడు గంగా మోహన్ చక్రు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టు చేనేత సంఘం ఉపాధ్యక్షుడు షికారి శ్రీనివాస్, కార్యదర్శి వందన లక్ష్మీనారాయణ, కోశాధికారి బాదం రాజకుమార్, టీపీసీసీ మాజీ కార్యదర్శి ఖాందేశ్ శ్రీనివాస్, డైరెక్టర్లు పోహార్ శైలేష్, పడాల్ గణేష్, ఖాందేశ్ సత్యం, విఠోభ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## ఆర్మూర్ చేనేత సహకార సంఘంలో జాతీయ చేనేత దినోత్సవం

**అక్షరటుడే, ఆర్మూర్ :** పట్టణంలోని చేనేత సహకార సంఘంలో పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 30మంది చేనేత కార్మికులను ఇటీవల ఎన్నికైన నూతన ఛైర్మన్ చెన్న రవికుమార్, వైస్ ఛైర్మన్ బెన్ని గంగా మోహన్, కోశాధికారి చిట్ల శ్యామ్ సుందర్ డైరెక్టర్లను ఘనంగా సన్మానించారు. ఆర్మూర్ పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు మ్యాక మోహన్ దాస్, ఛైర్మన్ రవి కుమార్ మాట్లాడుతూ..చేనేత సంఘానికి పూర్వ వైభవం తెస్తామన్నారు.

## కోటగిరిలో ఘనంగా ఊర పండుగ



**అక్షరటుడే, కోటగిరి :** మండల కేంద్రంలో ఊరపండుగను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు, ఎమ్మెల్యే, పోచారం శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాలరాజ్, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, యెండల లక్ష్మీనారాయణ హాజరై గ్రామదేవతలకు పూజలు చేశారు. పోచారం మాట్లాడుతూ.. గ్రామదేవతల ఆశీర్వాదంతో గ్రామ ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని వేడుకున్నారు. ఏఎంసీ ఛైర్మన్ గైక్వాడ్ హన్మంత్, బర్ల మధుకర్, గంగాధర్ దేశయ్, హౌగిరావు దేశాయ్, బర్ల గంగారం, తేల రవి కుమార్, పంది ముక్కుల సాయిలు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లపై రాజకీయాలు మానాలి



**అక్షరటుడే, బాల్కొండ:** డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లపై రాజకీయాలు మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని కేసీఆర్ కాలనీ సమీపంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వద్ద శుక్రవారం ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల అంశంపై ప్రజలను తప్పుదోవ పట్టించేలా వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు అధికారంలో ఉన్నప్పటికీ అర్హులైన ప్రతి పేద కుటుంబానికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అందించలేకపోయిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని, బాల్కొండ నియోజకవర్గంలో తొలి విడతలో సుమారు 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి సొంత ఇంటి కలను సాకారం చేసే దిశగా చర్యలు చేపట్టిందని తెలిపారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వెంకటేష్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు చాట్ల నరేష్, జిల్లా కార్యదర్శి యూనిస్, టౌన్ అధ్యక్షుడు సంజీవ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పోచారం ప్రాజెక్టు నుంచి నీటి విడుదల ప్రారంభం



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట మండలాల్లో వానాకాలం పంటల సాగు కోసం పోచారం ప్రాజెక్టు నీటిని విడుదల చేశారు. ప్రజాప్రతినిధులు, నీటిపారుదల శాఖ అధికారుల ఆధ్వర్యంలో శుక్రవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 1.820 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం పూర్తిస్థాయిలో నిండి పొంగిపొర్లుతోంది. దీంతో దిగువన ఉన్న చెరువులు, కుంటలు నింపేందుకు అధికారులు స్థానిక నాయకులతో కలిసి శుక్రవారం గేట్లను ఎత్తి 150 క్యూసెక్కుల నీటిని పోచారం ప్రధాన కాలువలోకి విడుదల చేశారు. 15 రోజుల పాటు ఆయకట్టుకు నీరు విడుదల చేస్తారు. అనంతరం 10 రోజులు నీటి విడుదలను నిలిపి వేస్తారు. రైతులు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ రజిత వెంకట్రామిరెడ్డి, రామచంద్ర రెడ్డి, వాసు, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో కురిసిన వర్షాలకు పోచారం జలాశయం పూర్తిస్థాయిలో నిండడంతో మాజీ జడ్పీటీసీ సభ్యుడు మనోహర్ రెడ్డి గంగమ్మ తల్లికి మొక్కులు తీర్చుకున్నారు. ఆయన మాట్లాడుతూ, జూలై 9న జలాశయం పూర్తిస్థాయిలో నిండాలని కోరుతూ అమ్మవారికి మొక్కుకున్నానని తెలిపారు. నెల రోజుల్లోనే జలాశయం నిండడంతో బీఆర్ఎస్ నాయకులతో కలిసి 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నామని, ప్రత్యేక పూజలు నిర్వహించామని చెప్పారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య పద్ధతిలో హెడ్ బాయ్, హెడ్ గర్ల్ ఎన్నికలు



**అక్షరటుడే, గాంధారి:** మండలంలోని స్థానిక పీఎంశ్రీ జడ్పీ హెచ్‌ఎస్‌లో శుక్రవారం స్కూల్ హెడ్ బాయ్, హెడ్ గర్ల్ ఎన్నికలను బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించారు. విద్యార్థులకు ఓటు హక్కు, ప్రజాస్వామ్య విలువలు, నాయకత్వ లక్షణాలపై అవగాహన కల్పించేందుకు సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు మార బాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు జరిగాయి. ఓట్ల లెక్కింపు అనంతరం స్కూల్ హెడ్ బాయ్‌గా షేక్ నదీమ్, హెడ్ గర్ల్‌గా నిఖిత ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సుజాత మాట్లాడుతూ.. విద్యార్థుల్లో క్రమశిక్షణ, బాధ్యతాయుత ప్రవర్తన పెంపొందించడానికి ఇటువంటి ఎన్నికలు దోహదపడతాయన్నారు. ఎన్నికైన విజేతలను మండల తహశీల్దార్ రేణుక, ఎంఈవో శ్రీహరి, సర్పంచ్ రేణుక సంజీవ్ యాదవ్, ఉప సర్పంచ్ భాస్కర్ గౌడ్, ఎస్ఎంసీ ఛైర్‌పర్సన్ శారదా, మార్కెట్ కమిటీ ఛైర్మన్, హెచ్‌ఎం సుజాత ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## ఓబీసీ 11వ జాతీయ మహాసభల్లో నిజామాబాద్ బీసీ శ్రేణులు




**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** బెంగళూరులో జరుగుతున్న ఓబీసీ 11వ జాతీయ మహాసభల్లో నిజామాబాద్ బీసీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నాయి. కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరులో ఈ మహాసభలు జరుగుతున్నాయి. ఆగస్టు 7న మండల సిఫార్సులు అమలై బీసీలకు రిజర్వేషన్లు వచ్చిన సందర్భంగా ప్రతి ఏడాది దేశవ్యాప్తంగా ఓబీసీ జాతీయ మహాసభలను నిర్వహిస్తుంటారని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ పేర్కొన్నారు. ఈ ఏడాది కర్ణాటకలోని బెంగళూరులో జరుగుతున్న ఈ మహాసభలకు నిజామాబాద్ జిల్లాలోని బీసీలు పెద్దఎత్తున హాజరయ్యారని ఆయన వివరించారు. దేశంలో ఎక్కడ బీసీ కార్యక్రమం జరిగిన నిజామాబాద్ జిల్లా నుండి పెద్ద ఎత్తున పాల్గొని మన గళాన్ని వినిపించడం సంతోషంగా ఉందన్నారు. ఈ మహాసభల్లో సంఘం ప్రతినిధులు కరిపె రవీందర్, కొయ్యాడ శంకర్, మాడవేడి వినోద్ కుమార్, చంద్రకాంత్, శ్రీలత, ఆర్టీసీ శ్రీనివాస్, చంద్రమోహన్, భూమన్న, రవి, బాలన్న శ్రీనివాస్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి



**అక్షరటుడే, బాన్సువాడ:** ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీజేపీ,బీజేవైఎం నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని రేణుక ఒకేషనల్ కాలేజీలో శుక్రవారం 'ఫీజు బకాయి.. బీజేపీ లడాయి' పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొనాల గంగారెడ్డి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను చెల్లించడంలో విఫలమయ్యాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.15 వేల కోట్ల మేర బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, దాదాపు 40 లక్షల మంది విద్యార్థులు ఈ పథకాలపై ఆధారపడి ఉన్నారని పేర్కొన్నారు. వెంటనే బకాయిలు విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులతో కలిసి పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి శంకర్ గౌడ్, పట్టణ ప్రధాన కార్యదర్శులు చిరంజీవి, ఉమేష్, నాయకులు భాషా, భాస్కర్ రెడ్డి, చీకట్ల రాజు, అశ్విన్, పురుషోత్తం, సచిన్, నరేష్, పద్మ, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.